తొలి పండుగ.. ఆనందం నిండుగ

నూతన తెలుగు సంవత్సరాది ఉగాదిని ఉత్సాహంగా జరుపుకొన్నారు. తెలుగు సంవత్సరం ప్రారంభమయ్యేది ఈ పండుగ నుంచే అనే విషయం తెలిసిందే. కావున ఈ ప్రత్యేకమైన పర్వదినాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఏ ఇంట చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. మామిడి తోరణాలు, రకరకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. తొలుత అంతా ఇళ్ల వద్ద పూజలు జరిపి.. అనంతరం ఆలయాలకు వెళ్లి ఇష్ట దైవాలను దర్శించుకున్నారు.

- ఊరంతా ఉగాది వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఘనంగా పంచాగ శ్రవణం

మైదుకూరు : తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఆదివారం వాడవాడలా వసంతాలను చల్లుకొని కొత్త సంవత్సరం రాకను ఆనందంతో స్వాగతించారు. స్థానిక శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో వేద పండితుడు మాధవాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ఆలయాన్ని సందర్శించిన వారికి రాశి ఫలాలను వివరించారు. మండలంలోని ఎన్.ఎర్రబల్లె వద్ద వెలసిన శ్రీజనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి పౌరాణిక నాటకాల ప్రదర్శన జరిగింది.

బి.మఠంలో పంచాంగ పుస్తక ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం : శ్రీవిశ్వావసునామ సంవత్సరం ఉగాది సందర్భంగా పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో నూతన పంచాగ పుస్తకాన్ని పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, దత్తాత్రేయ స్వామి, వీరంబొట్లయ్యస్వామి, గోవిందస్వామి, మఠం మేనేజర్ ఈశ్వరాచారిలు ఆవిష్కరించారు. అనంతరం మఠం ఆస్థాన సిద్ధాంతి ఇడమకంటి జనార్దనాశివచార్యులు పంచాంగ పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


బ్రహ్మంగారిమఠం : పంచాంగ పుస్తకం ఆవిష్కరిస్తున్న వెంకటాద్రిస్వామి

■ బి.మఠం మండలంలో ఉగాది సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో ఉత్సాహంగా వసంతాలు చల్లుకున్నారు. విద్యుత్ దీప అలంకరణతో దేవాలయాలు నూతన శోభ సంతరించుకున్నాయి.

విశ్వావసు నామ సంవత్సరం అందరికీ శుభాలు తెచ్చింది

ప్రొద్దుటూరు కల్చరల్ : విశ్వావసు నామ సంవత్సరం అందరికీ శుభాలు తెస్తుందని బీవీ రామకృష్ణయ్య సిద్ధాంతి పేర్కొన్నారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో వర్షాలు సంమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని, ధాన్యం ధరలు పెరుగుతాయని తెలిపారు. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఆర్థిక విషయాల్లో దృఢంగా ఉండాలని, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. వివిధ రాశుల వారికి ఆదాయ, వ్యయాలను వివరించారు. ఈ సందర్భంగా యడవల్లి రమణయ్య భాగవతార్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన భక్త మయుర ధ్వజం హరికథ అందరిని ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్ద రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : పంచాంగ పఠనం చేస్తున్న బీవీ రామకృష్ణయ్య సిద్ధాంతి

అమ్మవారిశాలలో..

స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బ్రహ్మశ్రీ మల్లాది వెంకట రామనాథశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరానికి రాజు, సేనాధిపతి సూర్యభగవానుడని, ఆయనను కొలిచే వారికి శుభాలు కలుగుతాయని తెలిపారు. వివిధ రాశుల ఆదాయ, వ్యయాలను వివరించారు. వర్ధమాన గాయకులు సాకేత్, వైష్ణవి ఆలపించిన భక్తి గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : అమ్మవారిశాలలో భక్తి గీతాలు ఆలపిస్తున్న సాకేత్, వైష్ణవి

వైభవంగా పల్లకీ సేవ

రాజుపాళెం : మండల పరిధి వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఆలయాల్లో వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు చేశారు. భక్తులు స్వాములను దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా ఆలయంలోని ధ్యాన మందిరంలో అర్చకులు పంచాంగ శ్రవణం చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ రామమోహన్ పాల్గొన్నారు.

అందరికీ విజయాలు చేకూరాలి

విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ విజయాలు చేకూరాలని అర్చకులు పేర్కొన్నారు. వెల్లాల పుణ్యక్షేత్రంలో పార్వతీదేవి, భీమలింగేశ్వర, వీరభద్ర, నరసింహ స్వాములకు అర్చకుడు వెంకటాచలపతి.. చెన్నకేశవ, సంజీవరాయ స్వామి ఆలయంలో అర్చకులు శేషాచార్యులు, మాధవాచార్యులు, పవన్, సురేంద్రలు ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవికి 303 నిమ్మకాయలతో దండ, గులాబీ, కనకాంబరం, మల్లెపూల దండలు వేసి శోభాయమానంగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో..

కాశినాయన : తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గతంలో ఉగాది పండుగకు రైతులు ఏరువాకను ఘనంగా నిర్వహించేవారు. మారుతున్న కాలానుగుణంగా కాడెద్దులు కనుమరుగైపోయాయి. గతంలో ప్రతి ఇంటికి పాడి ఎద్దు ఉండేవి. రాను రాను పశువులను మేపడం భారం కావడంతో రైతులు కాడెడ్లపై దృష్టి సారించడం లేదు. ఈ నేపథ్యంలో ఏరువాక సాగేవారు భుజాన గొడ్డలి వేసుకుని పొలాల్లోకి వెళ్లి కంపచెట్లను తొలగించారు. ఎద్దులు ఉన్న వారు ఎద్దులను అలంకరించి పొలాల్లోకి వెళ్లి ఏరువాక నిర్వహించారు.


రాజుపాళెం : వెల్లాలలో ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

గోపవరంలో..

గోపవరం : మండల వ్యాప్తంగా ఉగాది పర్వదినం సందర్భంగా ఆయా గ్రామాల్లోని కోదండరామ స్వామి ఆలయాల్లో పంచాంగ శ్రవణంతోపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో పాటు రైతులకు అన్ని విధాలుగా బాగుంటుందని పంచాంగకర్తలు తెలియజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో కోదండరామస్వామి గ్రామోత్సవాలు నిర్వహించారు.

ఘనంగా పెద్దపీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు


స్వామి దర్శనం కోసం క్యూలో భక్తులు


పెద్దపీరయ్యస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం : మండల పరిధి ముడుమాలలోని సిద్దయ్యస్వామి మఠంలో పెద్దపీరయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాలజ్ఞాన ప్రభోదకర్త శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రథమ శిష్యుడు సిద్దయ్యస్వామి నాలుగో కుమారుడు పెద్దపీరయ్యస్వామి మహిమాన్వితుడిగా ప్రసిద్ధి చెందారు. ఉగాది సందర్భంగా ఏటా పెద్దపీరయ్యస్వామి ఆరాధన జరగడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సిద్దయ్యమఠం పీఠాధిపతులు రామకృష్ణయ్య సోదరులు ఈ ఏడాది ఉత్సవాలు నిర్వహించారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, తాగునీరు, నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వివిధ కులాల సంఘాలు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి భజనలు, నాటకాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ రాత్రి పెద్దపీరయ్యస్వామి ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్నారు. పెద్దపీరయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దయ్య మఠంలో భక్తుల కోసం మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు.

నేడు బండలాగుడు పోటీలు

పెద్దపీరయ్యస్వామి ఆరాధన సందర్భంగా రెండవ రోజు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బండలాగుడు పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎడ్లకు ప్రథమ బహుమతి రూ.1లక్ష 116లు జెడ్పీచైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి తన తండ్రి పిచ్చిరెడ్డి పేరున ఇస్తున్నారు. రెండవ బహుమతి రూ.70 వేలు ఏఈ రామసుబ్బారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో, మూడవ బహుమతి రూ 45 వేలు, నాల్గువ బహుమతి రూ.30 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు ఇవ్వనున్నారు. అలాగే 16 మనుములు, 13 మనుములు రాతి గుండు ఎత్తిన వారికి బహుమతులు ఉన్నాయి.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం ఉగాదిని పురస్కరించుకుని అంకాలమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, మాజీ ఉప ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు రామాంజనేయులు, రామ్మోహన్‌లు అంకాలమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఈ పోటీలలో వరుసగా ఐదు స్థానాలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.1,00,116లు,రూ.80,116లు, రూ.60,116, రూ.40,116, రూ.20,116లు నగదు బహుమతులు అందజేశారు.

■ మండల వ్యాప్తంగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. తెలుగు నూతన సంవత్సరం కావడంతో ప్రతి హిందువు ఇళ్లను, వాహనాలు శుభ్రం చేసుకుని మామిడాకులతో అలంకరించుకున్నారు. ప్రతి ఊరిలో నూతన ఉత్సాహంతో రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. ఉగాది పచ్చళ్లతో పాటు పిండి వంటలను చేసుకుని ఉగాది పండుగను అత్యంత పవిత్రంగా జరుపుకొన్నారు.


అంకాలమ్మ దేవాలయం వద్ద నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలు

ఘనంగా శ్రీరామనామంతో ర్యాలీ

బ్రహ్మంగారిమఠం : ఉగాది శ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఆదివారం సాయంత్రం తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీ రామ నామం నినాదంతో భక్తులు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. బి.మఠం, కందిమాల్లాయపల్లె, తోట్లపల్లె తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తోట్లపల్లె నుంచి బ్రహ్మంగారిమఠం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని, పంచాగ పఠనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి విరజానందస్వామి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భక్తితో కూడిన విలువలను పాటించాలన్నారు. మంచికి అవకాశం ఇచ్చి, చెడుకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలలో భక్తి కల్గినప్పుడే సమాజం బాగుంటుందన్నారు. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుందన్నారు. వ్యవసాయం వృద్ధి చెందితే గ్రామాలలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. అనంతరం కొందరు భక్తులు సందేశాలు అందించారు. ర్యాలీలో చిన్నారులు కోలాటం ఆకట్టుకుంది.


ర్యాలీలో పాల్గొన్న విరజానందస్వామి

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామినీ శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ వార్షికోత్సవం, ఉగాది పర్వదినం సందర్భంగా నాలుగు మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉగది -షడ్రుచుల విశిష్టత అనే అంశంపై వ్యాసరచన, నేటి సమాజంలో సంస్కృతి - సంప్రదాయాలు అనే అంశంపై వక్తృత్వ, బాలురకు కబడ్డీ, బాలికలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ సభ్యులు గోపినాథ్‌రెడ్డి, పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణ, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న శివదర్శనానంద సరస్వతి మాతాజీ

నేడు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈద్గా మైదానంలో చలవ పందిళ్లు, తాగునీరు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేక ప్రార్థనల దృష్ట్యా ఉదయం నుంచి ప్రార్థనలు అయిపోయేంత వరకు పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ


వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఆర్యవైశ్య వాసవీక్లబ్ సభ్యులు ఉగాది సందర్భంగా ఆదివారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఓబుళాపురం వివేకానంద సేవాశ్రమంలో వృద్ధులకు పండ్లు, నూతన వస్త్రాలు అందజేశారు. అమ్మవారిశాల ప్రధాన అర్చకులు కౌసిక్‌శర్మ, రామశర్మతో పంచాశ్రవణం నిర్వహించి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షులు మోటపోతుల శివకుమార్, వనిత క్లబ్ అధ్యక్షులు కాకుమాని కృష్ణవేణి ఆధ్వర్యంలో సభ్యులు పవన్‌కుమార్, సుబ్రమణ్యం, సత్యనారాయణ, అమ్మణ్ణి, సీతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

బద్వేలు అర్బన్ : మన సనాతన ధర్మాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డిలు పేర్కొన్నారు. బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విశ్వావసునామ ఉగాది ఉత్సవాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తెలుగు ప్రజల మొదటి పండుగ, కష్ట, సుఖాలను సమానంగా తీసుకోవాలని తెలిపే పండుగ ఉగాది అని అన్నారు. తెలుగులోగిళ్ల సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఏటా ఉగాది సంబరాలను బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత హైస్కూల్ ఆవరణలోని బద్దెన కవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ వాస్తు జోతిష్య పండితులు బ్రహ్మశ్రీ కనుమళ్ళసత్యనారాయణశర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. అలాగే సాహిత్యం విభాగంలో మైదుకూరుకు చెందిన తవ్వాఓబుల్‌రెడ్డి, నృత్యం విభాగంలో బద్వేలుకు చెందిన సి.బాబు, సామాజిక సేవ విభాగంలో కడపకు చెందిన బోగాచిన్నయ్యలకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ఉగాది సంబరాల్లో భాగంగా కమలకూరుకు చెందిన సాలయ్య బృందం నిర్వహించిన కర్రసాము ప్రదర్శన, అనూష్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ శిల్పి, లలిత కళాభిరామ పింఛము అధ్యక్షుడు గొల్లపల్లి జయన్న, బద్దెన కళాపీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగసాని సాంబశివారెడ్డి, బలపనూరు శంభుప్రసాద్, సాంస్కృతిక కార్యదర్శులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, కోటపాటి ఓబులేసు, వైభవ్ ప్రసాద్, శీలివెంకటసుబ్బయ్య, కళాపీఠం గౌరవాధ్యక్షులు కె.వి.సుబ్బారెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


బద్దెన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు వెంటనే నిధులు కేటాయించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయా కార్పొరేషన్ల రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. అయితే ఇంత వరకు ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే నిధులు కేటాయించి ఎస్సీల అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం

కాశినాయన : మండలంలోని మూలపల్లె ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న చంద్రశేఖర్‌ఆచారి ఓ అనాథ కుటుంబానికి గూడు కల్పించి మానవత్వం చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన నరసాపురం గ్రామానికి చెందిన నాయలూరి శ్రీదేవి భర్త రెండు సంవత్సరాల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. భర్త మృతితో శ్రీదేవి పక్షవాతం సోకి మంచానికే పరిమితమైంది. ఆమెకు ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఆర్థిక పరిస్థితి బాగ లేకపోవడంతో.. చదువు మానేసి తల్లికి ఆసుపత్రిలో చూపించుకుంటున్నారు. వారికి సరైన ఇల్లు లేదు. గోడలు ఉన్న ఇంటికి పందిరి వేసుకుని జీవించేవారు. రెండు సంవత్సరాలుగా మంచానికే పరిమితమైన శ్రీదేవి కుటుంబాన్ని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆచారి గమనించి వారి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. రూ.53 వేలతో రేకులు, బండపరుప్పు, గోడలకు ప్లాస్టింగ్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. కొంత మంది స్నేహితుల సహకారంతో ఆ కుటుంబాన్ని ఆదుకున్నామని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌ఆచారి తెలిపారు. మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి శ్రీదేవి కుటుంబానికి సాయం అందించాలని ఆయన కోరారు.


శ్రీదేవి కుటుంబానికి సరుకులు అందజేస్తున్న చంద్రశేఖర్ ఆచారి

మౌలిక వసతుల కల్పనలో విఫలం

అట్లూరు : మండలంలోని అనేక గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్‌బాషా, మండల సీపీఎం కార్యదర్శి ఇ.రమణయ్య విమర్శించారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కరించకుంటే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవిచంద్ర, స్టీఫెన్, భాస్కర్, యేసు, మహిళా నాయకురాళ్ళు స్వప్న, మార్తమ్మ, కుమారి, లలితమ్మ, ధనమ్మ, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రజాచైతన్యయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

9న బిషప్ పట్టాభిషేక మహోత్సవం

పోరుమామిళ్ల : కడపలో ఏప్రిల్ 9న జరిగే బిషప్ పట్టాభిషేక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ నాయకుడు ఓబుళాపురం శోభన్‌కుమార్ పేర్కొన్నారు. కడప మేత్రాసనానికి చెందిన గురువు అదే పీఠానికి మేత్రాసనులుగా ఎన్నిక కావడంపై ఆదివారం స్థానిక ఆర్‌సీయం చర్చి ఆవరణలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శోభన్‌కుమార్ మాట్లాడుతూ పీఠాధిపతుల పట్టాభిషేకానికి ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాకోబ్, విజయబాస్కర్, బాలజోజి, రాయప్ప, జైపాల్, ఆనందం, రామోజీ, దేవరాజు, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయోధ్య పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మన్మథరావు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ రచించిన అయోధ్య పుస్తకాన్ని విజయవాడలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు ఆవిష్కరించారు. విజయవాడలో దీపం ఉగాది పురస్కారాల సందర్భంగా ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు గోకరాజు గంగరాజు, పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారాయణరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరం రోడ్డులో బుశెట్టి ధనలక్షుమ్మ శ్రీరాములు చారిటబుల్ ట్రస్టు సహకారంతో బుశెట్టి ధనలక్షుమ్మ శ్రీరాములు కమ్యూనిటీ హాల్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని బుశెట్టి రాంమోహన్ రావు కుమారుడు బుశెట్టి గోపినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తన నానమ్మ, అబ్బ బుశెట్టి ధనలక్షుమ్మ శ్రీరాములు జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శూలం ప్రసాద్, మేనేజర్ రమణ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కుక్కర్లు


కుక్కర్లు అందిస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

పోరుమామిళ్ల : రంగసముద్రం ఎంపీటీసీ ముంతాజ్ ఆమె భర్త మహబూబ్‌పీరా రంజాన్ పండుగను పురస్కరించుకొని ఆదివారం పారిశుధ్య కార్మికులకు ప్రెషర్ కుక్కర్లు ఉచితంగా అందజేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా వాటిని కార్మికులకు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, యువనేత గిరిప్రణీత్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, పంచాయతీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, షారూక్, హరి, చెంద్రాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సత్కారం


ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో నాయకులు

పోరుమామిళ్ల : తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని మైనారిటీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని శాలువా, పూలదండతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సకల శుభాలకు నాంది ఉగాది అన్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి


చలివేంద్రం ప్రారంభిస్తున్న నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాదాచారులు, ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణ పరిధిలో విరివిగా చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులో బద్వేలు పట్టణాభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. పట్టణాభివృద్ధి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు నానాబాలవెంకటేశ్వర్లు, బి.గురుమూర్తి, గౌరవ సలహాదారులు కొండపల్లిచిన్నసుబ్బారావు, ఉపాధ్యక్షులు కె.వి.సుబ్బారావు, రాజేష్, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, సొసైటీ నాయకులు వెంగలరావు, నాగార్జున, పెరుగు వెంకటయ్య, పెన్షనర్ల సంఘం కార్యదర్శి బ్రహ్మయ్య, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

సేవా పురస్కారం ప్రదానం


రామమోహన్‌కు పురస్కారం అందిస్తున్న సేవా సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : గౌడ చేయూత సంఘం వ్యవస్థాపకుడు, ఒంటిమిట్ట సబ్ ఇన్‌స్పెక్టర్ మన్యం రామమోహన్ గౌడ సేవలు అభినందనీయమని గౌడ సేవా సంఘం ప్రొద్దుటూరు అధ్యక్షుడు రామయ్య గౌడ తెలిపారు. స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లోని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రామమోహన్ గౌడకు ఉగాది సేవా పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు గౌడ సేవ సంఘం కార్యదర్శి రామకృష్ణ గౌడ, నాయకులు కంపరాజు కొండయ్య గౌడ, తిరుపాల్ గౌడ, రమణ, శ్రీనివాసులు గౌడ, దస్తగిరి గౌడ, నరసింహులు, రామసుబ్బయ్య, సుధాకర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.